క్లుప్తంగా

కొనసాగుతున్న సర్వే



రాజోళి: మండలంలో లెప్రసీ సర్వే కొనసాగుతోంది. జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో వైద్యసిబ్బంది ఇంటింటికెళ్లి సర్వే చేపట్టారు. శరీరంపై రంగుమచ్చలు, స్పర్శ లేకపోవడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు రావడం వంటి లక్షణాలపై ఆరా తీశారు. కుష్టు లక్షణాలు ఉన్న వారికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించి వివరాలను నమోదు చేసుకున్నారు. వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ జయప్రకాష్, లెప్రసీ నోడల్ పర్సన్ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

అయిజ: పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా టీకాలు వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి కోరారు. మండలంలోని చిన్న తాండ్రపాడు, మేడికొండ గ్రామాల్లో సోమవారం 1,067 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ డాక్టర్ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా టీకాలు అందిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

కేటీదొడ్డి: మండలంలోని పాగుంటలో సోమవారం ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ బండారి డేవిడ్, మండల ఇన్‌చార్జ్ జంబయ్య ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా జయప్ప, అశోక్, ప్రధాన కార్యదర్శులుగా ఆంజనేయులు, స్వామి, కార్యదర్శులుగా నర్సింహులు, స్వామి, సలహాదారుగా రామప్ప, గౌరవాధ్యక్షుడిగా రంగస్వామిని ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కరుణప్ప పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి క్షేత్రంలోని శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

వర్షాల కోసం..

ఉండవెల్లి: వర్షాల కోసం మండల కేంద్రంలోని శివాలయంలో రైతు సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణా, తుంగభద్ర నదుల నుంచి 101 బిందెలతో నీటిని తీసుకొచ్చి శివుడికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఈశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రమేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

టికెట్ కేటాయించొద్దు

అలంపూర్: స్థానిక సిట్టింగ్ ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ టికెట్ కేటాయించొద్దని క్యాతూర్ పీఏసీఎస్ చైర్మన్ రాఘవరెడ్డి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. మరోసారి సిట్టింగ్ ఎమ్మెల్యేకు టికెట్ కేటాయిస్తే నియోజకవర్గంలో చాలా మంది ప్రజాప్రతినిధులు పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే అవకాశం ఉందని తెలిపారు. విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ సారి సిట్టింగ్‌కు పార్టీ టికెట్ కేటాయించవద్దని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. వేరే వ్యక్తిని అభ్యర్థిగా నిర్ణయిస్తే శక్తివంచన లేకుండా పనిచేసి గెలిపిస్తామని పేర్కొన్నారు.

బీజేపీని ఆదరించండి

శాంతినగర్: గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా సోమవారం వడ్డేపల్లి మండలం కోయిల్‌దిన్నెలో ఆ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించి మరోసారి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్, మండల అధ్యక్షుడు నర్సింహులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల అభ్యున్నతే నాబార్డ్ లక్ష్యం

అమరచింత: చేనేత కార్మికులు వృత్తిలో రాణిస్తూ తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ చీరల తయారీతో ఆర్థికంగా ఎదిగేందుకు నాబార్డ్ ఎంతో చేయూతనిస్తోందని సీజీఎం సుశీల అన్నారు. అమరచింత చేనేత ఉత్పత్తిదారుల సంఘం ద్వారా పట్టణంలో చేనేత వస్త్రాల మార్కెటింగ్ షాప్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులు తయారు చేసిన వస్త్రాలను విక్రయించేందుకు ప్రత్యేకంగా మార్ట్ కావాలన్న ఉద్దేశంతో నాబార్డ్ ఆర్థిక భరోసాతో ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాబార్డ్ ఆర్ఓ, సిబ్బంది డీడీఎం శణ్ముక చారి, అఖి, శ్రావణ్ కుమార్, జ్యోతి, రాజ్‌కుమార్, లక్ష్మి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. జర భద్రం

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- నాలుగు డెంగీ కేసులు నమోదు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



తక్కశీలలో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది



అయిజలో నీటిసంపులో దోమల నివారణ మందు చల్లుతున్న వైద్యసిబ్బంది

ఉండవెల్లి: వ్యాధుల కాలం ప్రారంభమైంది. పల్లె, పట్టణాల్లో దోమల మోత మోగుతోంది. జాగ్రత్తలు పాటించకపోతే డెంగీ, మలేరియా వంటి విషజ్వరాల బారిన పడే ప్రమాదం ఉంది. వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు ఆహార నియమాలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

శుచీ శుభ్రత ముఖ్యం..

మనం తినే ఆహారంతో మొదలుకొని నివాస ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. ముఖ్యంగా బయటి ఆహారం తీసుకోకపోవడం ఉత్తమం. రోడ్ల పక్కన పానీపూరి, మిర్చిబజ్జీ, టిఫిన్ సెంటర్ల వద్ద తిని, అక్కడే చేతులు కడగడం వల్ల ఈగలు, దోమలు విజృంభిస్తాయి. అలాంటి ఆహార పదార్థాలు తిన్న వారు అనారోగ్యానికి గురవుతున్నారు. ఆరోగ్యకర ఆహారం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నీటి నిల్వలు ఉండొద్దు..

ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. ఎక్కువ రోజులపాటు నీటి నిల్వలు ఉంటే దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయి. నీటితొట్లను రెండు, మూడురోజులకోసారి శుభ్రం చేసుకోవాలి. పరిసరాల శుభ్రతపై వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంటింటికెళ్లి నిల్వ నీటిని పారబోయడంతోపాటు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు..

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నాం. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. అలంపూర్ నియోజకవర్గంలో 4 డెంగ్యూ కేసులు వచ్చాయి. వ్యాధుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. – ఇర్షాద్, జిల్లా ప్రోగ్రామ్ అధికారి

ప్రబలుతున్న డెంగీ

గ్రామీణ ప్రాంతాల్లో డెంగీ ప్రబలుతోంది. రోజు రోజుకూ దోమల వృద్ధితో వ్యాధులు విజృంభిస్తున్నాయి. అలంపూర్ నియోజకవర్గంలో నాలుగు కేసులు నమోదయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులపై పర్యవేక్షణ కొరవడడంతోనే వ్యాధులు ప్రబలుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డెంగీ జ్వరాలకు భయపడి పక్క రాష్ట్రమైన కర్నూల్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కళాశాల సమయానికి బస్సు నడపాలి



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సు నడపాలని కోరుతూ సోమవారం పీడీఎస్‌యూ బహుజన సేవ నాయకులు గద్వాల డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్వాల నుంచి తాటికుంట, తప్పెట్లమొర్సు, గొర్లఖాన్‌దొడ్డి మీదుగా వచ్చే బస్సు ఉదయం 10గంటలకు మండల కేంద్రానికి చేరుకుంటుందని, అప్పటికే కళాశాలలో మొదటి తరగతి అయిపోతుందన్నారు. కళాశాల సమయానికి బస్సు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కళాశాల సమయానికి బస్సు నడపాలని కోరారు. బస్సు వేళల్లో మార్పు చేస్తామని డీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త నాగన్న, రమేష్ పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

మానవపాడు: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని సంబంధిత అధికారులు తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేశారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో విద్యుత్ స్తంభం నెర్రలు బారి ప్రమాదకరంగా మారిందని ఈనెల 14న 'సాక్షి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు.. సోమవారం పాత స్తంభాన్ని తొలగించి కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో నాగులపంచమి వేడుకలు



రాజోళిలో పూజలు చేస్తున్న భక్తులు

రాజోళి: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో నాగులపంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలో నాగులపంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టల్లో పాలు పోశారు. అనంతరం నాగదేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వక్ఫ్‌బోర్డు నుంచి తొలగించండి

అమరచింత: పట్టణంలోని జామీయ మసీదుకు చెందిన రెండెకరాలు 15 గుంటల పట్టా భూమిని వక్ఫ్‌బోర్డులో తప్పుగా నమోదు చేశారని, అధికారులు వెంటనే దాన్ని తొలగించి పట్టా భూమిగా మార్చాలని సోమవారం ప్రజావాణిలో కమిటీ సభ్యులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జామీయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ధరణి పేరుతో రెవెన్యూ అధికారులు తప్పిదం చేసి జామియా మసీద్ భూమిని వక్ఫ్‌బోర్డులో కలిపినట్లు తెలిపారు. తమకు న్యాయం చేయాలని పలుమార్లు ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించినట్లు పేర్కొన్నారు. తౌఫిక్, అశు, మైనొద్దీన్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో బూత్ అధ్యక్షులదే కీలకపాత్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీఎస్ అరుణ్

గద్వాల రూరల్: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో బూత్ అధ్యక్షులదే కీలకపాత్ర అని ఎమ్మెల్సీ డీఎస్ అరుణ్ అన్నారు. గద్వాల మండలం, పట్టణంలో సోమవారం నిర్వహించిన విధాన్ సభ ప్రవాస్ యోజన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామస్థాయి నుంచే పార్టీ శక్తివంతం కావాలన్నారు. కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈసారి రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావడం ఖాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, డీటీడీసీ నర్సింహ, నర్సమ్మ పాల్గొన్నారు.

కేసీఆర్ నమ్మకాన్ని నిలబెట్టుకుంటా



అలంపూర్ చౌరస్తాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: సీఎం కేసీఆర్ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఎమ్మెల్యే వీఎం అబ్రహం అన్నారు. అబ్రహంకు బీఆర్ఎస్ టికెట్ కేటాయించడంతో సోమవారం అలంపూర్ చౌరస్తాలో పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి బాణాసంచా కాల్చారు. అనంతరం ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అలంపూర్ అభ్యర్థిగా రెండోసారి బరిలో నిలవడానికి తనకు అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 44వేల మెజార్టీని అందించి నియోజకవర్గంలో కొత్త చరిత్ర సృష్టించినట్లు తెలిపారు. ప్రజా ఆశీర్వాదంతోనే ఇది సాధ్యమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పని చేసి గతం కంటే ఎక్కువ మెజార్టీ సాధిస్తామన్నారు. డాక్టర్‌గా అరబ్ దేశాల్లో 12ఏళ్లు పనిచేస్తే.. నియోజకవర్గ ప్రజలకు 22ఏళ్లు సేవ చేశానన్నారు. అభివృద్ధి పనులు ఏ విధంగా జరిగాయో అందరికీ తెలుసన్నారు. ప్రజా సంక్షేమానికి దేశంలో ఎక్కడా లేని పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. తనపై నమ్మకంతో మరోసారి టికెట్ కేటాయించిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.



రాజోళి మండలం ముండ్లదిన్నెలో..

బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు..

అయిజ: బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే అబ్రహంను సీఎం కేసీఆర్ ప్రకటించడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంకాపురం రాముడు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. అలంపూర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా అబ్రహంను ఖరారు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మురళీధర్‌రెడ్డి, అయ్యన్న, సాయిబాబా, జయ్యన్న, సంజీవనాయుడు పాల్గొన్నారు.

రాజోళి: మండలంలోని పలు గ్రామాల్లో అబ్రహం అభిమానులు బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. అబ్రహంకు బీఆర్ఎస్ టికెట్ కేటాయింపుపై హర్షం వ్యక్తం చేశారు.

ఉండవెల్లి: ఎమ్మెల్యే అబ్రహంకు బీఆర్ఎస్ టికెట్ కేటాయించడంపై మండల కేంద్రంలో పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవన్న, ఈదన్న, నర్సింహ, వెంకటేశ్వర్లుగౌడ్, కొండన్న, మగ్బూల్, రాజశేఖర్, ఖాదర్, సుధాకర్, మజ్హర్‌బాషా పాల్గొన్నారు.



అయిజలో..



మానవపాడులో..

బీమాతో రైతు కుటుంబాలకు భరోసా



రైతుబీమా చెక్కు అందజేస్తున్న ఎంపీపీ విజయ్‌కుమార్

గట్టు: ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబీమా పథకం అన్నదాత కుటుంబాలకు భరోసాగా నిలుస్తోందని ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని చిన్నోనిపల్లికి చెందిన రైతు కుర్వ తిప్పన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, అతడి కుటుంబ సభ్యులకు మంజూరైన రూ.5లక్షల రైతు బీమా చెక్కును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తూ అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తుల నుంచి గృహలక్ష్మి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉమాదేవి, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాసులు, రమ్య, నర్సింహులు, జయరాంగౌడ్, నాగప్ప, పరమేష్, లక్ష్మణ్, లింగన్న, ఇంజన్న, వీరేష్ పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టడంలో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న నర్మద

గద్వాల అర్బన్: మహిళలపై దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్‌లో మహిళపై ఓ అధికారి లైంగిక వేధింపులకు పాల్పడటం, పెద్దపల్లిలో మైనర్ బాలికలను లైంగికంగా హింసించి చంపడం, ఎల్బీనగర్‌లో గిరిజన మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి మానసికంగా హింసించడం హేయమైన చర్యన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐద్వా సంఘం సభ్యులు హుస్సేనమ్మ, జయమ్మ, కవిత, గోవిందమ్మ ఉన్నారు.

ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మాదారి, మాదాసి కురువ సంఘం నాయకులు

మానవపాడు/ఉండవెల్లి: మాదాసి, మాదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిన్నమల్లయ్య డిమాండ్ చేశారు. జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం నుంచి చేపట్టిన పాదయాత్ర సోమవారం మానవపాడు, ఉండవెల్లి మండల కేంద్రాలకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదారి, మాదాసి కురువలు అటవీ ప్రాంతంలో నివాసముంటున్నారని, ప్రభుత్వం గుర్తించి అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. తమను ఎస్సీ జాబితాల్లో చేర్చి, సర్టిఫికెట్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామన్నారు. సుధాకర్, రామకృష్ణ, ఉపసర్పంచ్ మోహన్, రామాంజనేయులు, లోకేష్, వెంకటేష్, పకీరయ్య, మురళీకృష్ణ, మద్దిలేటి, రామకృష్ణ, రాముడు, వెంకటేశ్వర్లు నర్సింహులు, యేసయ్య, మద్దిలేటి పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు అవసరం



ధరూరులో ఏర్పాట్లు చేస్తున్న పీఈటీ

మల్దకల్: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని ఇన్‌చార్జ్ ఎంఈఓ కొండారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. మండలస్థాయి పోటీల్లో మొత్తం 80మంది క్రీడాకారులు పాల్గొనగా, 35మంది ప్రతిభకనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ జితేందర్, పీఈటీలు సుహాసిని, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అండర్–14, 17 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి, పీఈటీ శ్రీనివాసులు తెలిపారు.

ఏఎన్ఎంలను రెగ్యులర్ చేసే వరకు పోరాటం



బోనాలతో నిరసన వ్యక్తం చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

గద్వాల అర్బన్: సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేసే వరకు పోరాటం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రంగన్న అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో సెకండ్ ఏఎన్ఎంలు చేపట్టిన సమ్మె కొనసాగింది. సోమవారం సమ్మె శిబిరం నుంచి అంబేద్కర్ చౌరస్తా, పాతబస్టాండ్ మీదుగా బోనాలతో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రంగన్న మాట్లాడుతూ ఎన్‌హెచ్ఎం కింద పని చేస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఇటీవల ఏఎన్ఎంల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశన్న, విద్యావతి, జ్యోతి, భారతి, మహేశ్వరి, సరస్వతి, రాధ పాల్గొన్నారు.

నిఘా నేత్రలిలా.. నేరాలు ఛేదించేదెలా?



జిల్లా కేంద్రంలోని న్యూహౌసింగ్‌బోర్డు కాలనీలో నేలకొరిగిన సీసీ కెమెరాలు



గద్వాల అర్బన్: నేరాల ఛేదనలో సీసీ కెమెరాలు కీలకం. ఒక్కో సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని ఆ శాఖ అధికారులే చెప్తుంటారు. అలాంటి నిఘానేత్రం నేలచూపులు చూస్తోంది. జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, కాలనీల్లో సీసీ కెమెరాలు పని చేయడంలేదు. చోరీలు, చైన్ స్నాచింగ్ తదితర నేరాలు చోటుచేసుకునే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఉన్నా పని చేయకపోవడంతో నేరస్తులను గుర్తించడంలో పోలీసులకు ఇబ్బందిగా మారింది. ఇళ్లు, దుకాణాల్లో దొంగలు చోరీలకు పాల్పడినప్పుడు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే.. సీసీ కెమెరాలు పని చేస్తాలేవని పోలీసులు చెబుతున్నారని బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ కెమెరాలను బాగు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దక్షిణ కాశీలో శ్రావణమాస సందడి



పూజలు చేస్తున్న ఆర్డీవో చంద్రకళ



బాలబ్రహ్మేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



ఆలయంలో యోగా గురువు బ్రూస్లి

జోగుళాంబ శక్తిపీఠం: దక్షిణకాశీ, ఐదో శక్తిపీఠం అలంపురం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో శ్రావణశోభ సంతరించుకుంది. స్వామివారి ఆలయ వారోత్సవాల్లో భాగంగా రథోత్సవం నిర్వహించారు. నాగపంచమిని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బాలబ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. న్యూజిలాండ్‌కు చెందిన యోగా గురువు బ్రూస్లి ఆలయాలను దర్శించుకున్నారు. అదేవిధంగా గద్వాల ఆర్డీఓ చంద్రకళ కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆమెకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దేవస్థానం చైర్మన్ చిన్నకృష్ణయ్య, దర్మకర్త వెంకటనారాయణ ఆర్డీఓకు శేషవస్త్రాలను అందజేశారు.